క్లుప్తంగా

ముగిసిన ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: జి.సిగడాంలోని షిర్డీసాయి ఆలయ 19వ వార్షికోత్సవం సోమవారంతో ముగిసింది. ఆలయ ధర్మకర్త దేవిశెట్టి జగదీశ్వరరావు, డి.ఎం.రామం, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. ఆలయ ప్రాగణంలో భక్తులకు అన్నదానం చేశారు.

కోటేశ్వరస్వామికి అభిషేకాలు



స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వరస్వామికి వైశాఖ మాస సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూర్మనాథున్ని దర్శించుకున్న దేవదాయ శాఖ సలహాదారు



శ్రీకూర్మనాథాలయంలో జ్వాలాపురపు శ్రీకాంత్

గార: శ్రీకూర్మనాథుడ్ని దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురపు శ్రీకాంత్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదులతో అధికారులు స్వాగతం పలికారు. మూలవిరాట్ దర్శనం అనంతరం శ్రీకూర్మ క్షేత్ర వైభవాన్ని అర్చకులు తెలియజేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణమాచార్యులు, కిశోర్‌బాబు ఉన్నారు.

నిత్యన్నదానానికి రూ. లక్ష విరాళం



చెక్‌ను అందజేస్తున్న దృశ్యం

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయంలో జరుగుతున్న నిత్యన్నదాన పథకానికి శ్రీకాకుళానికి చెందిన కురసా రవికుమార్, ఛాయారెడ్డిలు రూ. ఒక లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని సోమవారం అందజేశారు. ఈ మేరకు చెక్‌ను కార్యాలయ సూపరింటెండెంట్ నర్సుబాబుకు అందజేశారు.

పని దినాలు కల్పించాలని వినతి

రణస్థలం: అర్ధాంతరంగా నిలుపుదల చేసిన యూబీ ఒప్పంద కార్మికులందరినీ విధుల్లోనకి తీసుకుని పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీ.హెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు కోరారు. యునైటెడ్ బ్రేవరీస్ ఒప్పంద కార్మికులందరికీ పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు పాల్గొన్నారు.

విశ్వనాథం సేవలు చిరస్మరణీయం



విశ్వనాథం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాజీ ఎంపీ కణితి విశ్వనాథం సేవలు చిరస్మరణీయమని కళింగ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.సూర్యం అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కళింగ భవన్‌లో సోమవారం విశ్వనాథం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పలాసలో కిడ్నీ ఆస్పత్రికి విశ్వనాథం పేరు పెట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు హనుమంతు కృష్ణారావు, బొడ్డేపల్లి సత్యవతి, పొన్నాడ అప్పలనాయు డు, గురుగుబెల్లి అప్పలనాయుడు, వైకుంఠరావు, పైడి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

విద్యార్థులు అడ్మిషన్లు పొందాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉచిత విద్య కోసం ఎంపికైన విద్యార్థులు మంగళవారం వారిక కేటాయించిన ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందాలని డీఈవో తిరుమల చైతన్య తెలిపారు.

నేత్ర చికిత్సలకు తరలింపు

శ్రీకాకుళం రూరల్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు మూడో విడత కార్యక్రమంలో భాగంగా సింగుపురం గ్రామానికి చెందిన 20 మందిని శ్రీకాకుళంలోని రిమ్స్ సర్వజన ఆస్పత్రికి సోమవారం అధికారులు తరలించారు.

ప్రతిపక్షాల కుట్రను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం:

సంక్షేమ పథకాలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్టు ప్రతిపక్షాల చేస్తున్న కుట్రను వైఎస్సార్‌సీపీ శ్రేణులు బలంగా తిప్పి కొట్టాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించినట్టు చెప్పారు. అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 63 గ్రామ సచివాలయాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించగా ఎక్కడా వ్యతిరేకత కనిపించలేదు సరికదా.. మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతుగా లక్షలాది మంది మిస్డ్‌కాల్స్ ఇవ్వడం సంచలనమే అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ప్రజా ఆమోదంతోనే ఇంటింటికీ స్టిక్కర్లు అతికిస్తున్నామని స్పష్టం చేశారు. జి.సిగడాం మండలంలో 18,077 ఇళ్లకు 17,062, లావేరులో 19,887కు 17,773, రణస్థలంలో 27,677కు 23 వేలు, ఎచ్చెర్ల మండలంలో 22,407కు 20,500 గృహాలను సందర్శించామన్నారు. మిగతా కొన్ని ఇళ్లకు వెళ్లాల్సి ఉందన్నారు. అలాగే మరికొన్ని డోర్ లాక్‌లో ఉన్నట్టు చెప్పారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కోటికిపైగా కుటుంబాలను పార్టీ శ్రేణులు కలవగా.. అందులో 79 లక్షలకు పైగా జగనన్న పాలనకు మద్దతుగా 82960 82960 నంబర్‌కు మిస్డ్‌కాల్ చేసి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారన్నారు. ఇటీవల టైమ్స్ నౌ సంస్థ సర్వే చేసి రాష్ట్రంలోని 25 స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని తేల్చిందన్నారు. గతంలో కూడా ఇదే సంస్థ సర్వే చేసి 22 సీట్లు వస్తాయని నివేదిక ఇచ్చిందన్నారు. లోకేష్ పాదయాత్రలో మహిళలు తొమ్మిదేళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఎందుకు ఇన్ని సంక్షేమ పథకాలు ఇవ్వలేదో చెప్పాలని నిలదీస్తున్నారన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టేందుకు గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, కాయల వెంకటరమణ, పార్టీ నాయకులు రొక్కం బాలకృష్ణ, మీసాల వెంకటరమణ, మహంతి పెదరామినాయుడు, దన్నాన రాజీనాయుడు, జరుగుళ్ల శంకరరావు, చిల్ల వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, మూగి శ్రీరాములు, డోల వెంకటరమణ, రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, బల్లాడ జనార్దన్ రెడ్డి, సనపల నారాయణరావు, వై.ప్రకాశ్, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌కి జనం జేజేలు



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

- పీపుల్స్ సర్వేకు విశేష స్పందన
- వైఎస్సార్‌సీపీ నాయకుల వెల్లడి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి జనం జేజేలు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఈ నెల ఏడో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో జగనన్నే మా భవిష్యత్ పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మెగా పీపుల్స్ సర్వేను ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా ఏడు లక్షల మంది పార్టీ సైనికులు ప్రతి ఇంటిని సందర్శించి రాష్ట్ర భవిష్యత్ కోసం ఎవరిని విశ్వసిస్తున్నారనే అంశంపై వారి అభిప్రాయాలను ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేశారన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, పార్టీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు మాట్లాడారు. మెగా సర్వేలో వస్తున్న ఫలితాలే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు తార్కాణమన్నారు. మెగా పీపుల్స్ సర్వేలో తొలి 15రోజుల్లో కోటి కుటుంబాలు పాల్గొనగా.. సీఎం జగన్ పాలనకు మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ రావడం అభినందనీయమన్నారు. సర్వేలో భాగంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో ఇంతవరకు 1.20 లక్షల కుటుంబాలను సందర్శించామన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన వాటిని సందర్శించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రతి కుటుంబాన్ని కలిసి వారి అభిప్రాయాలు తెలుసుకోవడమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రిపై ప్రజలకు ఉన్న నమ్మకం మాటల్లో చెప్పలేమని..దీనికి జనం నుంచి వస్తున్న ఆదరణే ఉదాహరణ అన్నారు. ప్రతి ఒక్క వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ పరిధిలో సచివాలయాన్ని సందర్శించి కార్యక్రమం జరుగుతున్న తీరు.. దానికి ప్రజల నుంచి వచ్చే ప్రతిస్పందనను స్వయంగా పర్యవేక్షించాలని కోరారు. మెగా పీపుల్స్ సర్వేకు క్షేత్రస్థాయిలో వస్తున్న స్పందనతో ప్రతిపక్షాలు ఉలిక్కి పడుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు బలంగా ఉన్న కొన్ని నియోజకవర్గాల్లో ప్రజలకు అందుతున్న లబ్ధిని వివరిస్తూ.. మెగా సర్వేలో ముందుకు సాగుతూ వైఎస్సార్‌సీపీ చూపుతున్న సానుకూల ధోరణితో ప్రతిపక్ష పార్టీ నిద్రలేని రాత్రులను గడుపుతోందన్నారు. మనం ప్రజల ఇళ్లను నేరుగా సందర్శించి వారితో వ్యక్తిగతంగా మాట్లాడినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి అంటే ఏమిటో చూడగలమన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన పింఛను పొందుతున్న వృద్ధుల ఆశీస్సుల్లో, అమ్మఒడి కృతజ్ఞతతో పిల్లలను బడికి పంపుతున్న తల్లుల చిరునవ్వుల్లో ఇది కనిపిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెగా సర్వే, క్షేత్ర స్థాయి పర్యటనలతో నియోజకవర్గంలో ప్రజలు తమ, వారి పిల్లల భవిష్యత్ కోసం విశ్వసించే ఏకైక వ్యక్తి సీఎం జగన్, మంత్రి ధర్మాన ప్రసాదరావు అని తేటతెల్లం కానుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయరావు, నాయకులు కోణార్క్ శ్రీను, చల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీ తప్పనిసరి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ తప్పని సరిగా నిర్వహించాలని ఎంఈవో కారు పున్నయ్య అన్నారు. ఎచ్చెర్లలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 25న పాఠశాల అవరణలో సోషల్ ఆడిట్ జరగాలని చెప్పారు. హెచ్‌ఎంలు తమ మొబైల్ యాప్‌లో పాఠశాలల వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. నాడు-నేడు పథకం అమలుకు ముందు పరిస్థితి, ప్రస్తుతం ఎలా ఉందో నమోదు చేయాలన్నారు. 107 అంశాలపై ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక ప్రిన్సిపాల్ పద్మజ, ఏఎస్‌వో హరికృష్ణ, ఏపీవోలు శ్రీనివాసరావు, నలినీకాంత్, పీఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

బదిలీ న్యాయమూర్తులకు వీడ్కోలు



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కోర్టులో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీపై వెళుతున్న ఆడిషినల్ జిల్లా జడ్జి కె.వెంకటేశ్వరులు, సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీదేవిలకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ వారి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, బీసీ న్యాయవాదులు సంఘం జిల్లా అధ్యక్షులు అగూరు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, కూన అన్నంనాయుడు, సీనియర్ న్యాయవాదులు వాన కృష్ణచందు, ఎం.క్రాంతి, ఎ.కృష్ణంరాజు పాల్గొన్నారు.

పశుసంవర్థక ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పశుసంవర్థకశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే బాధ్యత ఉద్యోగ సంఘాలదేనని గౌరవ అధ్యక్షుడు, ముఖ్య అతిథి డాక్టర్ పాట్నూరు అన్నారు. నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ శ్రీకాకుళం శాఖ చైర్మన్ తిరుమలరావు ఆధ్వర్యంలో సచివాలయ పశుసంవర్థకశాఖ సహాయకుల జిల్లా నూతన, శాశ్వత సంఘాన్ని స్థానిక పశు సంవర్ధక శాఖ ప్రాంగణంలోని మీటింగ్ హాలులో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తమ్మినేని అయ్యప్ప, సహాధ్యక్షులుగా కె.ముకుందరావు, జనరల్ సెక్రటరీగా పి.మల్లేష్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం.నీలిమ, బి.వెంకటనరేష్, ఎం.ఉదయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా తంగి రవి, ఎం.బాలకృష్ణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఓ.కల్యాణ్ చక్రవర్తి వ్యవహరించారు.

డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంగ్లిషుకు విశ్వవ్యాప్త గుర్తింపు ఉందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు అన్నారు. ఆంగ్లభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో సోమవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే వేడుకలను నిర్వహించారు. పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్య చంద్రరావు, పి.సుధాకర్ ప్రధాన వక్తలుగా హాజరై ఇంగ్లిషు ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ఇంగ్లిషు విభాగం లెక్చరర్లు పీఎస్ కనకదుర్గ, కె.మౌనిక, పి.హిమబిందు, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర నారాయణ పాల్గొన్నారు.

కుండపోత వర్షం



పెంట గ్రామంలో రోడ్లపై చేరిన నీరు

జి.సిగడాం: నాగులవలస, పెంట, మర్రివలస, మానంపేట, సర్వేశ్వరపురం తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. పొలాల్లో నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ప్రతి ఇంటికీ సంక్షేమం చేరువ

- ఎమ్మెల్యే కిరణ్‌కుమార్
- సర్వేశ్వరపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేరువ చేస్తున్నారని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పున్నాం సచివాయలం పరిధి సర్వేశ్వరపురం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో చేకూరిన లబ్ధిని తెలియజేసి.. అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా నిలబడి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చందక శారద, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి బలరాం, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, పల్లేడ సన్యాసిరావు జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాద్వికశ్రీ కుటుంబాన్ని ఆదుకుంటాం

మెట్టవలసలో కుక్కల దాడిలో చిన్నారి పైల సాద్వికశ్రీ మృతి చెందడం బాధకరమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందన్నారు. సాద్వికశ్రీ తల్లిదండ్రులు పైల రాంబాబు, రామలక్ష్మిలను మెట్టవలస గ్రామానికి వెళ్లి పరామర్శించి ఓదార్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు తదితరులున్నారు.

నేడు ముషినివలస, రౌతుపేట గ్రామాల్లో..

జి.సిగడాం: పున్నాం సచివాలయం పరిధి ముషినివలస, రౌతుపేట గ్రామాల్లో మంగళవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ నిర్వహిస్తారని ఎంపీపీ మీసాల సత్యవతి తెలిపారు.

సంక్షిప్తంగా...

మణికంఠకు అభినందనలు

రణస్థలం: చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన కొంతల మణికంఠ వ్యాసరచన పోటీల్లో జాతీయస్థాయిలో ప్రథమంగా నిలిచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ స్థాయిలో బహుమతి అందుకున్నారు. ఈయన్ని రణస్థలం వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పైడి శ్రీనివాసరావు సోమవారం సత్కరించి అభినందించారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జిల్లా ఎస్పీ

శ్రీకాకుళం: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును జిల్లా ఎస్పీ జీఆర్. రాధిక సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

గురుకులంలో ప్రవేశానికి గడువు పెంపు

గార: వమరవల్లి గురుకుల (బాలికల) పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసేందుకు గడువు పొడిగించినట్టుల ప్రిన్సిపాల్ బి.అరుణ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అండర్-19 క్రికెట్ ప్రాబబుల్స్ జాబితా ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-19 బాలుర క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ జాబితా వెలువడింది. 35 మంది సభ్యులతో కూడిన జాబితాను క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ సోమవారం ప్రకటించారు.

ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం అర్బన్: దంత వ్యాధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఉషా డెంటల్ క్లినిక్ డాక్టర్ సుష్మ, డాక్టర్ కల్యాణచక్రవర్తి అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీకాకుళం రెండ డిపో మేనేజర్ కె.ఎస్.ఆర్.శర్మ పాల్గొన్నారు.

అణు పార్కు రద్దు చేయాలి

రణస్థలం: కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. కోటపాలెంలో సీపీఎం ఆధ్వర్యంలో అణు ప్లాంట్‌ను రద్దు చేయాలని సోమవారం ధర్నా చేశారు. సీపీఎం నాయకులు పి.తేజేశ్వరరావు, సీహెచ్ అమ్మన్నాయుడు ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 8 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ హాల్లో హైదరాబాద్‌కు చెందిన మైండ్ బ్రింక్ మీడియా పల్స్ సంస్థ సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. రీసెర్చ్ ఎనలిస్టు, డేటా ఎనలిస్ట్, రీసెర్చ్ రిపోర్టర్ల పోస్టులకు ఎనిమిది మందిని ఎంపిక చేశారు. ఏడాదికి రూ. 3.50 లక్షలు వేతనం అందజేయనున్నా రు. కంపెనీ ప్రతినిధులు రాజీవ్, చైతన్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం దిశగా పంచాయతీలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికుమార్
- ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



రణస్థలం: సమావేశంలో మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాల ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకరమౌతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది పాలనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పంచాయతీలకు బహుమతులు అందజేసి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీల్లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. రైతుల కోసం ఆర్‌బీకేలు, ప్రజా పాలనకు గ్రామ సచివాలయాలు, పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం జగనన్న పాలవెల్లువ కేంద్రాలు, సంపూర్ణమైన ఆరోగ్య గ్రామాలుగా ఉండేందుకు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుతో పాటు సీసీ రోడ్లు, కాలువులు, వీధి దీపాలు, మంచినీటి సదుపాయం వంటి ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఎంపీడీవో వి.ధనుంజయరావు, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గార: పరిశుభ్రత, చైల్డ్ మేనేజ్‌మెంట్ కేటగిరీల్లో వమరవల్లి పంచాయతీకి జిల్లాస్థాయి అవార్డు దక్కింది. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును సర్పంచ్ సుగ్గు లక్ష్మీబాయి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ నుంచి అందుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు సుగ్గు లక్ష్మీబాయి, సెక్రటరీ సత్యం పాల్గొన్నారు. అలాగే గార మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు పంచాయతీల సర్పంచ్‌లను సన్మానించారు. ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు సర్పంచ్‌లను దుశ్శాలువ, బొకేలతో సత్కరించారు. అలాగే జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాతమ్మను కూడా సన్మానించారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని 14 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులను మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులను ఎంపీపీ మొదలవలస చిరంజీవి సన్మానించారు. మండలంలో 28 పంచాయతీలు ఉండగా పేదరికానికి దూరంగా ఉన్న కొత్తపేట, అల్లినగరం, ఇబ్రహింబాద్, ఆరోగ్య పంచాయతీలుగా అరిణాంఅక్కివలస, అల్లినగరం, సంతసీతారాంపురం, తాగునీరు సంవృద్ధిగా అందజేస్తున్న పంచాయతీలుగా కొత్తపేట, బొంతలకోడూరు, బుడగుట్లపాలెం, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీలుగా కొయ్యాం, కొత్తపేట, బుడగుట్లపాలెం, మెరుగైన మౌలిక వసతుల విభాగంలో అల్లినగరం, జరజాం, తోటపాలెం, సామాజిక భద్రత పంచాయతీలుగా పొన్నాడ, తోటపాలెం, అజ్జరం, గుడ్ గవర్నెన్స్ విభాగంలో పొన్నాడ, తోటపాలెం, అజ్జరాం, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీలుగా అరిణాం అక్కివలస, కొంగరాం, అల్లినగరం ఎంపికయ్యాయి. కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్ బాబా పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: ధ్రువీకరణ పత్రాలు పొందిన సర్పంచులు, కార్యదర్శులతో ఎంపీపీ చిరంజీవి



జి.సిగడాం: సన్మానం పొందిన సర్పంచ్‌లతో అధికారులు, ప్రజాప్రతినిధులు

జి.సిగడాం: పల్లెల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల వెంకటరమణ అన్నారు. మండల మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులను సత్కరించారు. మండలాభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, వైస్ ఎంపీపీలు మీసాల సాద్వీమణి, తోలేటి వెంకటరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులను అధికారులు సత్కరించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ పంచాయతీలుగా గూడెం, పొన్నాం, ఇప్పిలి, కరజాడ, కుందువానిపేట, తండ్యావలస, సింగుపురం, రాగోలు, అలికాం, కనుగులవానిపేట పంచాయతీలకు అవార్డులు లభించాయి. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్య, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, ఎంపీడీవో రఘు పాల్గొన్నారు.

లావేరు: వివిధ కేటగిరీల్లో ఎంపికైన పంచాయతీలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయా సర్పంచ్‌లకు అధికారులు అవార్డులు అందజేశారు. గుర్రాలపాలెం, గుమడాం, బుడుమూరు పంచాయలకు మూడు, కేశవరాయునిపాలెం పంచాయతీకి ఐదు, పెదకొత్తపల్లి, పాతరౌతుపేట, పోతయ్యవలస, గుంటుకుపేట పంచాయతీలకు రెండు, పెదలింగాలవలస, ఆదపాక, లావేరు, గోవిందపురం, చిన్నయ్యపేట పంచాయతీలకు ఒకటి చొప్పున అవార్డులు వచ్చాయి. ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకహ్వానితుడు రొక్కం బాలక్రిష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, మండల పంచాయతీ అధికారి వి.విశ్వేశ్వరరావులు ఆయా సర్పంచ్‌లుకు అవార్డులు అందజేసి సన్మానించారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, మండల పరిషత్ సూపరింటెండెంట్ సునీత, ఎంఈవో ఎల్.ఈశ్వరరావు పాల్గొన్నారు.



లావేరు: గుర్రాలపాలెం సర్పంచ్ షేక్‌చాన్‌బాషాను సత్కరిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం రూరల్: అవార్డు అందుకుంటున్న కరజాడ పంచాయతీ సర్పంచ్



గార: జెడ్పీటీసీ సభ్యురాలు సుజాతమ్మను సన్మానిస్తున్న దృశ్యం